ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
శనివారం 26 డిసెంబరు 2025
www.prajaswaramdailly.com
4 pm

# అసెంబ్లీ స్పీకర్ కన్నుమూత



**అగర్తలా, ప్రజాస్వరం:**
త్రిపుర అసెంబ్లీ స్పీకర్ విశ్వ బంధు సేన్ శుక్రవారం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మరణించారు. ఆయన వయసు 72. దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా సేన్ గత కొన్ని నెలలుగా బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 8న ఆయనకు తీవ్రమైన సెరిబ్రల్ స్ట్రోక్ రావడంతో త్రిపురలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర శస్త్రచికిత్స జరిగింది. మెరుగైన చికిత్స కోసం ఆ తర్వాత ఆయన్ను బెంగళూరులోని ఒక ఆసుపత్రికి తరలించగా, అక్కడే ఆయన మరణించారు.

# ఫామ్ హౌస్ లో కేసీఆర్ సమావేశం



**హైదరాబాద్, ప్రజాస్వరం**
మాజీ సీఎం కేసీఆర్ శుక్రవారం ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్ కీలక సమావేశం నిర్వహించారు. కేటీఆర్, హరీష్‌రావుతో పాటు ఉమ్మడి మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, బహిరంగ సభల తేదీలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

**ఫోన్ ట్యాపింగ్ కేసు లో కేసీఆర్‌కు నోటీస్ జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి హరీశ్‌రావునూ విచారించే యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. కేసు దర్యాప్తునకు కంక్లూజన్ ఇవ్వాలంటే వీరిద్దరినీ విచారించాల్సిన అవసరముందని భావిస్తున్నట్లు సమాచారం. త్వరలో వీరిద్దరికీ సమన్లు జారీ చేసి విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.**

# పేమెంట్ కోటాలో సీఎం

## ఎన్నో హామీలిచ్చి అన్నీ ఎగవేత

## హైదరాబాద్ ప్రజలకు పాదాభివందనం చేసినా తక్కువే

## బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్కేటీఆర్

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ఆయన కిస్మత్ బాగుండి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని బీఆర్ ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. మేడిగడ్డను కూల్చివేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు చెక్ డ్యామ్ లను పేల్చివేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ‘‘ఎన్నో హామీలిచ్చిన రేవంత్ రెడ్డి అన్నీ ఎగవేశారన్నారు. ఆయన కిస్మత్ బాగుండి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారన్నారు. హామీల గురించి ప్రశ్నిస్తే రేవంత్ బూతులు తిడుతున్నారన్నారు. తిట్ల భాష మాకూ వచ్చు.. కానీ మేం తిట్టం. పెంచుతామన్న పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారో సీఎం చెప్పాలని అన్నారు. జీహెచ్ ఎంసీ ఎన్నికల్లో బీఆర్ ఎస్ ను వరుసగా రెండుసార్లు గెలిపించారన్నారు. హైదరాబాద్ ప్రజలకు నేను పాదాభివందనం చేసినా తక్కువేనని అన్నారు.. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు అని కేటీఆర్ అన్నారు.

# ప్రభాకర్ రావు విడుదల

## జనవరి 16న సుప్రీంకు సిట్ నివేదిక

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన తెలంగాణ మాజీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ టి ప్రభాకర్ రావును శుక్రవారం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయిన తర్వాత రెండు వారాల పాటు సిట్ విచారించిన మాజీ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారిని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుండి విడుదల చేశారు. ప్రభాకర్ రావును కస్టడీలో విచారించిన దానిపై సిట్ తన నివేదికను జనవరి 16న సుప్రీంకోర్టుకు సమర్పించనుంది. **నిందితుడిని సిట్ మరింత కస్టడీకి కోరుతుందా లేదా అనేది తక్షణమే స్పష్టం కాలేదు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా అప్పటి బీఆర్ ఎస్ ప్రభుత్వం తనను ఎందుకు ఎస్ఐబి చీఫ్‌గా నియమించిందనే దానిపై సిట్ ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. దీని వెనుక ఏదో దురుద్దేశం ఉందని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అప్పటి మంత్రి హరీష్ రావుతో తరచుగా జరిపిన సమావేశాల గురించి కూడా ఆ మాజీ ఐపీఎస్ అధికారిని విచారించినట్లు తెలిసింది.**

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరా మస్తాన్ విచారణ

**హైదరాబాద్, ప్రజాస్వరం**
ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరా మస్తాన్ విచారణ ముగిసింది. ఆరా మస్తాన్‌ను రెండున్నర గంటలపాటు సిట్ ప్రశ్నించింది. సాక్షిగా ఆరా మస్తాన్ వాంగ్మూలాన్ని రెండోసారి సిట్ అధికారులు తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డితో.. ఆరా మస్తాన్ మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేసినట్లు తెలిసింది. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్న సమయంలో.. మస్తాన్ సంభాషణలు ట్యాపింగ్ అయినట్టు గుర్తించారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి, బండి సంజయ్, హరీష్ రావు, ఈటల, కిషన్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు గుర్తించిన విషయం విదితమే. మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని.. ప్రభాకర్ రావు టీం ఆరా మస్తాన్ ఫోన్ ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో సాక్షిగా ఆరా మస్తాన్ స్టేట్మెంట్ ఇచ్చారు.




# హైదరాబాద్ - విజయవాడ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్

## టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్

**హైదరాబాద్, ప్రజాస్వరం**
వరుసగా వచ్చిన క్రిస్మస్ సెలవులు ముగియడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్‌తో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి, చౌటుప్పల్, కోర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ వరకు ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు కదలని పరిస్థితి నెలకొంది.ఇక ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారాయి. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, పంతంగి ప్రాంతాల్లో బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో



రోడ్డు సామర్థ్యం గణనీయంగా తగ్గింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా, ట్రాఫిక్ జామ్‌లు మరింత తీవ్రతరం అవుతున్నాయి.

**ఈ అభివృద్ధి పనులు పూర్తయ్యే వరకు ఇలాంటి పరిస్థితులు తప్పవని అధికారులు చెబుతున్నారు.**
**రద్దీ పెరిగిన నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను మళ్లిస్తూ ట్రాఫిక్‌ను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, అత్యవసర సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాచకొండ ట్రాఫిక్ పోలీసులు కీలక సూచనలు చేశారు. జాతీయ రహదారి మీద ప్రయాణించే వారు వీలైనంత వరకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని, ప్రయాణానికి ముందు ఆన్‌లైన్‌లో ట్రాఫిక్ అప్‌డేట్‌లను చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న వాహనాల రద్దీ మరో రెండు రోజుల పాటు కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.**

# నింద నేను మోయాలి

## ‘దండోరా’ను ఆదరించండి..

## నటుడు శివాజీ

**హైదరాబాద్, ప్రజాస్వరం**
‘దండోరా’. దయచేసి నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకండని, నేను వాటి గురించి విడిగా చూసుకుంటానని, వాటివైపు వెళ్లకుండా ఈ సినిమాను ప్రమోట్ చేయండని, లేదంటే ఆ నింద నేను మోయాల్సి వస్తుందని నటుడు శివాజీ అన్నారు. ‘దండోరా’ను ఆదరించిన ప్రేక్షకులకు చిత్రబృందం ధన్యవాదాలు తెలిపింది. థియేటర్‌లో ఆడియన్స్ స్పందన చూస్తుంటే గూస్‌బంప్స్ వచ్చాయని దర్శకుడు మురళీకాంత్ అన్నారు. పల్లె కథగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘దండోరా’ పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. తాజాగా చిత్రబృందం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. ‘‘కొన్ని తరాలకు ఒకసారి ఇలాంటి సినిమా వస్తుంది. రెండురోజుల ముందు ప్రీమియర్స్ పడినట్లైతే కలెక్షన్లు వేరేలా ఉండేవి. సెన్సార్ వల్ల విడుదల ఆలస్యమైంది.



**‘దండోరా’ గురించి 2026 మొత్తం కూడా మాట్లాడుకుంటారు. విదేశాల్లో కూడా మంచి ఆదరణ లభిస్తోంది. ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నన్ని రోజులు నేను నిద్రపోయింది కేవలం రెండు గంటలే. ఎందుకంటే ముఖం ఉబ్బుగా ఉండాలని నిద్ర మానుకున్నాను. సినిమా మొత్తం నిద్రముఖంలానే ఉంటుంది. నా పాత్రకు నేను అలా కనిపించకపోతే డైరెక్టర్ దెబ్బతింటాడు. నిద్రమానుకోమని డైరెక్టర్ నాకు చెప్పలేదు.. కానీ, నేనే అలా చేశా. సినిమా కోసం ప్రతి ఆర్టిస్టూ ప్రాణం పెడతారు. అలా చేసిన సినిమానే ‘దండోరా’. దయచేసి నా వ్యక్తిగత విషయాల వైపు వెళ్లకండి. నేను వాటి గురించి విడిగా చూసుకుంటాను. వాటివైపు వెళ్లకుండా ఈ సినిమాను ప్రమోట్ చేయండి. లేదంటే ఆ నింద నేను మోయాల్సి వస్తుంది. ఈ సినిమా గురించి మాత్రమే మాట్లాడండి. కావాలంటే నేను థియేటర్‌కు వస్తాను. ఏం మాట్లాడాలన్నా నేను థియేటర్‌లో మాట్లాడతాను. మంచి సినిమాను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆర్టిస్టుకు ఉంటుంది’’ అని అన్నారు.**